సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



వైద్య శిబిరాలకు సర్వం సిద్ధం

జిల్లావ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి క్యాంపులు ప్రారంభం కానున్నాయి.

8లో ▸



బాబాయ్ అరెస్టు

భీమవరం లెప్రసీ కాలనీలో బాలిక హత్య కేసులో నిందితుడు వరుసకు బాబాయ్ అయిన శివను అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

8లో ▸



బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

మార్టేరులో నాలుగు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి 9వ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి.

8లో ▸

న్యూస్‌రీల్

ఆలయ భూముల స్వాధీనం



స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

వీరవాసరం: వీరవాసరం గ్రూపు ఆలయాలకు సంబంధించిన వ్యవసాయ భూములు ఆక్రమణలకు గురాకావడంతో స్వాధీనం చేసుకున్నామని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈ.సుబ్బారావు తెలిపారు. వీరవాసరం, తలతాడు తిప్పలోని దేవస్థానం భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. వీరవాసరం గ్రూపు ఆలయాలకు సంబంధించిన 231/2 సర్వే నంబర్‌లో 71 సెంట్లు, 461/2 సర్వే నంబర్‌లో 80 సెంట్లు, 226/3లో 32 సెంట్లు, 14 61/2లో 2 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా మరో 470 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, కోర్టు పరిధిలో ఉండటంతో తీర్పులు వెలువడిన వెంటనే వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించి వచ్చేనెలలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ వేణుగోపాలరావు, చైర్మన్ కందుల సురేష్, ఎస్సై నాలం శ్రీనివాసరావు, పి.రమేష్ పాల్గొన్నారు.

మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయడానికి, అర్హులైన అభ్యర్థులను ప్యానెల్‌లో పేర్లను చేర్చడానికి దరఖాస్తులను కోరుతున్నట్టు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్స్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సి.పురుషోత్తంకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరులో రెండు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరులో ఒకటి చొప్పున మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నెలకు రూ.30 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తారని, వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు ఏలూరులోని తమ కార్యాలయంలో అందించాలని సూచించారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం, అభ్యర్థులకు నిర్దేశించిన అర్హతలు తప్పక కలిగి ఉండాలని తెలిపారు.

బీసీ కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపీ

పాలకొల్లు అర్బన్: బీసీ కుల గణన చేయాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానించడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ అన్నారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీ కుల గణనతో రాష్ట్రంలో బీసీలకు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు చేకూరతాయన్నారు. అలాగే పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందడానికి రాష్ట్రానికి చెందిన 38 మంది ఎంపీలు మద్దతుగా నిలిచారన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందడానికి సీఎం జగన్ కృషి చేశారన్నారు. మహిళలు, బీసీలు సీఎం జగన్‌కి రుణపడి ఉంటారన్నారు. బీసీలకు రాజ్యాధికారం అనే మాస్టర్ కీని ముఖ్యమంత్రి అందించారన్నారు. బీసీలకు సీఎం జగన్‌ని దూరం చేయాలని కుట్రపన్నుతున్న పెత్తందారులకు బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): అనుమతిలేని లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా అక్రమ లేఅవుట్లు వేయడాన్ని నిరోధించడంతో పాటు ఇప్పటికే గుర్తించిన అక్రమ లేఅవుట్లను తొలగించాలని ఆదేశించారు. ఐపీఎల్‌పీ లేఅవుట్లు ఆమోదం పొందిన ప్రకారమే రూపొందించేలా పర్యవేక్షించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ లేఅవుట్ల రెగ్యులరైజేషన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని లేఅవుట్లపై డీపీఓతో కలిసి నివేదికను రూపొందించాలన్నారు.

ఆరోగ్య సురక్షకు పటిష్ట చర్యలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు.

తీగలకు రాజకీయ అడ్డంకులు

- మెరుగైన విద్యుత్ సరఫరాకు సర్కారు యత్నం
- భూములివ్వని ప్రతిపక్ష మద్దతుదారుల వైజం
- ఉమ్మడి మూడు జిల్లాలకు కష్టకాలం
- ఉన్నతాధికారుల ఉదాసీనతా కారణం



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఏటేటా పెరుగుతున్న అవసరాలు, వినియోగానికి తగినట్లు విద్యుత్ పంపిణీకి మెరుగైన ఏర్పాట్లకు గత టీడీపీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేయనందున వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. విద్యుత్ సరఫరాలో నిరంతర అవాంతరాలతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన లక్షలాది మంది వినియోగదారులు సమస్యల పరిష్కారానికి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. తక్షణ ఇబ్బందులను తొలగించడంతో పాటు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందటే చర్యలను చేపట్టింది. పక్కా ప్రణాళిక ప్రకారం పనులు పూర్తయి విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగితే వినియోగదారుల నుంచి ప్రభుత్వానికి సానుకూలత ఏర్పడుతుందనే భావనతో ఆయా గ్రామాల్లో పెద్ద రైతులుగా చలామణి అవుతున్న పలువురు సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. తమతో పాటు భూములు ఇవ్వకుండా ఇతర రైతులను కూడా ఉసిగొల్పుతున్నారని సంబంధిత ఉన్నతాధికారులకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ఇలా చేస్తున్న వారిలో ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన వారున్నారని తెలుస్తోంది.

400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు..

కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అంతరాలు లేని విద్యుత్ సరఫరాకు వీలుగా కృష్ణా జిల్లా యలపర్రు వద్ద 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు అందుకు అవసరమైన ఫీడర్, లైన్ల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఈఐఎల్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని పనులు చేపట్టింది. గన్నవరం, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని బాపులపాడు, తేలప్రోలు, ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ముక్కపాడు, వింజరంపాడు, వెంట్రప్రగడ, చిన్నపారుపూడి, పెద్దపారుపూడి మీదుగా యలపర్రుకు 400 కేవీ విద్యుత్ లైన్ వెళ్లాల్సి ఉంది.

రాజకీయ దురుద్దేశంతో..

విద్యుత్ లైను నిర్మాణం జరగాలంటే నిర్దేశిత మార్గంలోని భూమి నిర్మాణ సంస్థకు అందుబాటులో ఉండాలి. పనులకు అడ్డంకులు తలెత్తకూడదు. కానీ పై గ్రామాల పరిధిలోని రైతులు ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన పలువురు ఉద్దేశపూర్వకంగానే మోకాలడ్డుతున్నారు. మూడు జిల్లాల పరిధిలోని లక్షలాది మంది విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నానికి సహాయ నిరాకరణ చేయడాన్ని అందరూ తప్పు పడుతున్నారు.

ఉన్నతాధికారుల జోక్యం అవసరం

విద్యుత్ లైను నిర్మాణం త్వరితగతిన సాగాలన్నా, మూడు జిల్లాల వినియోగదారులకు విద్యుత్ కష్టాలు తీరాలన్నా రెవెన్యూ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సహకారంతోనైనా సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేసి ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోలవరం కుడి కాలువ తవ్వకం సమయంలో..

రాష్ట్రానికి వరప్రదాయిని అయిన పోలవరం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందరి కలలను సాకారం చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తలచారు. ప్రాజెక్టు నిర్మాణం రూపుదిద్దుకునే లోపు కుడి, ఎడమ కాలువలను కూడా తవ్వించి నీటిని మళ్లించాలని పనులు ప్రారంభింపచేశారు. కుడి కాలువ పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఆ ప్రాంత నాయకులు, రైతులు ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించారు. కోర్టులను ఆశ్రయించారు. భూములు ఇవ్వకుండా, కాలువ పనులను అడ్డుకోగలిగారు. కానీ భూసమీకరణకు అంగీకరించి తమ భూములను అప్పగించిన ప్రాంతాల్లో మాత్రం కాలువ తవ్వకం పనులను వైఎస్సార్ కొనసాగింపచేశారు. ఆ తరువాత పట్టిసీమ పేరిట టీడీపీ సర్కారు చేపట్టిన ప్రాజెక్టుకు అదే రైతులు సహకరించి భూములు అప్పగించడంతో బిట్లుబిట్లుగా ఆగిపోయిన పోలవరం కుడి కాలువ పనులను పూర్తిచేసి నీటిని విడుదల చేయగలిగారు. ఇప్పుడు కూడా పోలవరం కాలువ పనులకు అడ్డంకులు సృష్టించిన రీతిలోనే విద్యుత్ లైను నిర్మాణానికి మోకాలడ్డుతున్నారనేది తేటతెల్లం అవుతోంది.

8,568 మందికి 'వాహన మిత్ర'



వాహన మిత్ర చెక్కు అందిస్తున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఐదో విడతలో 8,568 మందికి రూ.8.57 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎం జగన్ విజయవాడలో పథకాన్ని బటన్ నొక్కి ప్రారంభించిన కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్, ఎండీయూ వాహనాలు నడుపుతూ జీవనం సాగించే వారికి వాహన మిత్ర సాయం అందిస్తున్నారన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఆచంటలో 922 మందికి, భీమవరంలో 1,225 మందికి, నరసాపురంలో 930 మందికి, పాలకొల్లులో 975 మందికి, తాడేపల్లిగూడెంలో 1,284 మందికి, తణుకులో 1,358 మందికి, ఉండిలో 1,558 మందికి, గణపవరం మండలంలో 316 మందికి మొత్తంగా 8,568 మందికి రూ.8.57 కోట్లు జమైనట్టు చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి ట్రాన్స్‌పోర్టు అధికారి కె.సంజయ్‌కుమార్, డీఎల్డీఓ కేసీహెచ్ అప్పారావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్, చైతన్య, స్వయంకృషి, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆటో యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజ సేవకులు

శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు



మండలి చైర్మన్ మోషేన్‌రాజు సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పేదల సంక్షేమం కోసం ఆస్తి మొత్తం వితరణ చేసిన త్యాగమూర్తులు పాలకొల్లు ఆర్యవైశ్యులని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ప్రశంసించారు. పట్టణంలోని మన్యం జగ్గమ్మగారి సత్రంలో రూ.40 లక్షలతో అభివృద్ధి చేసిన ఏసీ కల్యాణ మండపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి ప్రధాన దాత యిమ్మిడి సత్యనారాయణ పేరు పెట్టడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా విద్య, వైద్య రంగాలకు ఆర్యవైశ్యులు చేస్తున్న సాయం ప్రజలు మరిచిపోరన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యా, అన్నదానం చేసిన మాతృమూర్తి మన్యం జగ్గమ్మ అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయంలో పనిచేసి పదవీ విరమణ చేసిన అరిగి సీతమ్మకు సీఎం జగన్ ఆర్థిక ఫండ్ నుంచి విడుదల చేసిన రూ.4 లక్షల చెక్కును అందజేశారు. సత్రం చైర్మన్ నంబూరు శ్రీగంగా పవన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, టీటీడీ సభ్యుడు మేకా శేషుబాబు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, చింతలపూడి, దెందులూరి పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, డీటీడీసీ బాబు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం.మైఖేల్‌రాజు, ఆలయాల చైర్మన్‌లు పాల్గొన్నారు.

రజత శోభితం





అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, (ఇన్‌సెట్‌లో) వెండి చీర అలంకరణలో కనకదుర్గమ్మ

పెనుమంట్ర: మార్టేరులోని శివరావుపేటలో కనకదుర్గమ్మ వారికి రూ.16 లక్షల దాతల సహకారంతో సమకూర్చిన వెండి చీరను శుక్రవారం అలంకరించారు. వెండితో తయారు చేసిన చీరపై బంగారు రంగులను అద్ది అమ్మవారికి అలంకరణ చేశారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. చీర తయారీకి సహకరించిన దాతలను శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ మట్టా కుమారి రాము, ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధా జోగిరెడ్డి, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సత్తి వెంకటరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిర్ల సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

● కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆనందోత్సాహాలు



కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆకివీడు మండలం దుంపగడపలో ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ మళ్లీ జగనే మా ముఖ్యమంత్రి అంటూ నినదించారు. కాంట్రాక్టు అధ్యాపకులు విక్టర్ బాబు, ఎస్.రజనీ, పీవీ సత్యనారాయణ, వైవీఎస్ సుబ్రహ్మణ్యేశ్వరి, పి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. - ఆకివీడు

పథకాల ద్వారా ప్రజలకు లక్షల కోట్ల లబ్ధి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో లబ్ధిదారులకు వాహన మిత్ర చెక్కు అందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: అధికారాన్ని అడ్డం పెట్టుకొని చంద్రబాబు వేల కోట్లు దోచుకుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు లక్షల కోట్లు పంచుతున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల్లో పాలనా వ్యత్యాసాలను ప్రజలు గుర్తించాలని కోరారు. శుక్రవారం ఎంవీఐ డీఎస్ఎస్ నాయక్ అధ్యక్షతన తాడేపల్లిగూడెం ఎస్‌వీఆర్ సెంటర్ వద్ద వైఎస్సార్ వాహన మిత్ర చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొట్టు మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ఆటో డ్రైవర్ల కష్టాలను తెలుసుకుని, వారి సంక్షేమం కోసం వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఆటో నిర్వహణ, మరమ్మతులకు ఏటా రూ.10 వేలు అందించడంతో వాహన కార్మికుల కుటుంబాలు సంతోషంగా ఉన్నాయన్నారు. పథకం ద్వారా ఇప్పటివరకూ ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 వేలు సాయం అందించారన్నారు. పథకాల లబ్ధిని నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేస్తున్నామని, గత టీడీపీ పాలనలో ఈ సొమ్ములు ఏమయ్యాయని ప్రశ్నించారు.

జగన్‌కు మళ్లీ పట్టం కట్టాలి

ప్రతిఒక్కరూ సీఎం జగన్ పాలన తీరును పరిశీలించి వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని మంత్రి కొట్టు కోరారు. చంద్రబాబు తనకు కావల్సిన వారికి మాత్రమే లబ్ధి చేకూర్చాడని, పేదలను గాలికి వదిలేశాడని దుయ్యబట్టారు. స్కిల్ డెవలప్‌మెంటు, ఇన్నర్ రింగ్‌రోడ్డు, రాజధాని భూములు, ఫైబర్ నెట్ వంటి స్కామ్‌లతో పాటు మరిన్ని కుంభకోణాలు బయటపడనున్నాయన్నారు. అవినీతిమయంతో చంద్రబాబు జైలుపాలయ్యాడని, టీడీపీని ప్రజలు నమ్మడం లేదన్నారు. గత టీడీపీ పాలనలో డ్వాక్రా మహిళల రుణమాఫీ, రైతు రుణమాఫీ తదితర హామీలను నెరవేర్చకపోవడంతో టీడీపీపై ప్రజలు విముఖతగా ఉన్నారన్నారు. అనంతరం రూ.1,28,40,000 చెక్కును వాహన మిత్ర లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆటో ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. చెన్నా జనార్దన్, ముప్పిడి సంపత్ కుమార్, కొట్టు విశాల్, ఆర్టీఓ కార్యాలయ ఏఓ కేఆర్‌కే వర్మ, కానిస్టేబుల్ ఆంజనేయులు, తాడేపల్లిగూడెం పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అద్దంకి పురుషోత్తం, మద్దా శ్రీనివాసరావు, కోశాధికారి బాసంశెట్టి రామచంద్రరావు, పలు ఆటో యూనియన్ల అధ్యక్షులు అడబాల శ్రీనివాసరావు, గున్నేపల్లి సోమరాజు, నేకూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి ఎవరు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారో చూద్దాం


తాడేపల్లిగూడెం రూరల్: గిఫ్ట్ సంగతి తర్వాత చూద్దాం.. ముందు ఏపీకి రిటర్న్ రమ్మనండి.. తండ్రి జైల్లో ఉంటే కొడుకు ఢిల్లీలో ఖరీదైన లాడ్జిలో కులుకుతున్నాడు.. అంటూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ లోకేశ్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో లోకేశ్ ఉన్న లాడ్జికి రోజుకు రూ.2 లక్షల 25 వేలు అద్దె చెల్లించి అక్కడ జల్సా చేస్తున్నాడని ఆయన చెప్పారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణయపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. స్కిల్ స్కాం కేసులో నిందితుడిగా ఉన్న చంద్రబాబు పీఏ అమెరికా పారిపోగా, ఇంకొకరు దుబాయ్ పారిపోయాడని మరొకరు మాయమైపోయాడని ఆయన అన్నారు. ఇక లోకేశ్ విషయానికొస్తే ఏ క్షణంలో అయినా తనను అరెస్టు చేస్తారని భయంతో ఢిల్లీలో దాక్కున్నాడని చెప్పారు. అది కూడా రోజుకు రూ.2,25,000 అద్దె చెల్లించి లాడ్జిలో జల్సా చేస్తున్నాడని విమర్శించారు. ఇక్కడ తండ్రి చంద్రబాబు స్కిల్ స్కాం కేసులో జైలులో ఉంటే అక్కడ కొడుకు లోకేశ్ ఖరీదైన లాడ్జిలో జల్సాగా గడుపుతున్నాడని చెప్పారు. రాష్ట్రం నుంచి పారిపోయి ఢిల్లీలో దాక్కుని సొల్లు కబుర్లు చెప్పడం కాదని, ఆంధ్రప్రదేశ్‌కు వస్తే ఎవరికి ఎవరు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారో తెలుస్తుందని అన్నారు.

దేశీయ పశు సంపద అభివృద్ధికి కృషి

పెంటపాడు: దేశీయ మేలు జాతి పశు సంపదను అభివృద్ధి పరిచేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఉప సంచాలకుల కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల వెటర్నరీ డాక్టర్లు, ఏడీలు, వీఏఎస్‌లతో ఒక్క రోజు శిక్షణ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక పథకాలను పాడి రైతులకు వివరించాలన్నారు. అధిక పాల దిగుబడికి జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ముర్రా, ఒంగోలు తదితర జాతుల అభివృద్ధి, సెక్సర్ సెమన్ ద్వారా ఆడపాడి దూడల అభివృద్ధికి తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. ఉత్తమ గడ్డిజాతులు, పశువులలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వెంకట్రామన్నగూడెం గేదెల పరిశోధన కేంద్ర శిక్షణా నిర్వాహకులు డాక్టర్ ఎం.రవికుమార్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గూడెం డివిజన్ ఉపసంచాలకులు ఎల్‌కే సుధాకర్, ఏడీఏలు, వెటర్నరీ డాక్టర్లు, వీఏఎస్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం

సాక్షి, భీమవరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లాలో మండల పార్టీ అధ్యక్ష పదవికి నూతన నియామకాలు చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. అధ్యక్షుల నియామకం ఇలా.. కడలి ధర్మారావు (వీరవాసరం), తిరుమాని ఏడుకొండలు (భీమవరం), తోట భోగయ్య (భీమవరం పట్టణం), కర్రి ఏసుబాబు (మొగల్తూరు), దొంగ మురళి (నరసాపురం రూరల్), దోసరపు జయ ప్రకాష్ (నరసాపురం టౌన్), గణేశ్న రాంబాబు (కాళ్ల), పీవీ ఆర్‌కే ఆంజనేయరాజు (ఉండి), కటిక శ్రీదేవి (పాలకోడేరు), గుండా సుందరామనాయుడు (ఆకివీడు పట్టణం), అన్యం కృష్ణ (ఆకివీడు రూరల్), జక్కంశెట్టి చంటి (ఆచంట), నల్లమిల్లి వేణుప్రతాప్‌రెడ్డి (పెనుగొండ), గూడూరి దేవేంద్ర రాజు (పెనుమంట్ర), పిల్లి నాగన్న (పోడూరు), అడబాల వెంకటరమణ (పాలకొల్లు టౌన్), విప్పర్తి ప్రభాకర్ (పాలకొల్లు రూరల్), పితాని సత్యనారాయణ (చిన్నా) (పోడూరు), పాతూరి బుచ్చిరాజు (యలమంచిలి), బోడపాటి వీర్రాజు (తణుకు రూరల్), మంగిన సూర్య (తణుకు టౌన్), పైబోయిన సత్యనారాయణ (అత్తిలి), దుర్గా ప్రసాద్ (ఇరగవరం), కైగాల శ్రీనివాస్ (పెంటపాడు), నరేంద్రకుమార్ (తాడేపల్లిగూడెం రూరల్), గుండుబోగుల నాగు (తాడేపల్లిగూడెం టౌన్)ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



క్లుప్తంగా

మద్ది హుండీ ఆదాయం రూ.38.24 లక్షలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. 64 రోజుల ఆదాయాన్ని లెక్కించగా రూ.36,13,345, నాణేల రూపంలో రూ.1,59,943, అన్నదానం హుండీ ద్వారా 49,775, నాణేల రూపంలో 1,039 మొత్తం 38,24,102 వచ్చినట్లు ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు.











వైద్య శిబిరాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు
- నవంబర్ 13 వరకు కొనసాగనున్న వైద్య శిబిరాలు
- వైద్య శిబిరాల్లో సేవలందించనున్న 77 మంది స్పెషలిస్టు వైద్యులు
- సిద్ధంగా 120 రకాల మందులు, 14 రకాల కిట్‌లు

ప్రజల ఆరోగ్యమే రాష్ట్రానికి మహాభాగ్యం అని భావించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇప్పటికే వైద్య సేవలను మెరుగుపరచగా, మరో అడుగు ముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే చేయించారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి శనివారం నుంచి ప్రారంభించే ప్రత్యేక వైద్య శిబిరాల్లో ద్వారా గ్రామాల్లోనే మరింత మెరుగైన వైద్యం అందించనున్నారు.



ఉండిలో జగనన్న ఆరోగ్య సురక్ష ట్రయల్ మెడికల్ క్యాంప్ (ఫైల్)



నర్సాపురంలో వైద్య శిబిరానికి చేరిన మందుల కిట్‌లు

భీమవరం (ప్రకాశం చౌక్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి ఇంటింటా సర్వే చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,51,881 కుటుంబాలను సర్వే చేశారు. ఈ సర్వేలో 1,10,881 మందికి పరీక్షలు పూర్తి చేశారు. ముందుగా వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఏఎన్‌ఎంలు ఇళ్లు సందర్శించే షెడ్యూల్‌ను తెలియజేశారు. ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యల వివరాలను కేస్ షీట్‌లో నమోదు చేస్తున్నారు.

తొలిరోజు జిల్లాలో 26 క్యాంపులు

జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి వైద్య క్యాంపులు ప్రారంభమవుతున్నాయి. మొదటి రోజు జిల్లాలో 26 క్యాంపులు నిర్వహించనున్నారు. అందులో 20 క్యాంపులు గ్రామాల్లో ఏర్పాటు చేయగా 6 క్యాంపులు అర్బన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 30 తేదీ నుంచి నవంబర్ 13వ తేదీ వరకు ఈ క్యాంపులు కొనసాగుతాయి. మొత్తం 384 వైద్య క్యాంపులు నిర్వహిస్తారు. వైద్య క్యాంపులు జరిగే షెడ్యూల్ బట్టి ఆయా ప్రాంతాల్లో ముందుగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించే 26 క్యాంపులకు 14 రకాల పరీక్షలు కిట్‌లు, 120 రకాల మందుల కిట్‌లు, వైద్యులు, వైద్య సిబ్బంది అంతా సిద్ధం చేశారు.

క్యాంపులో వైద్య సేవలు ఇలా..

సర్వేలో ఆరోగ్య సమస్యల ఉన్న వారికి స్థానికంగా ఏర్పాటు చేసే వైద్య క్యాంపులో ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తారు. ఈ క్యాంపుల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారు. క్యాంపులో 14 రకాల పరీక్షలు, 23 రకాల మందులను ఉచితంగా అందిస్తారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం అవసరం అయితే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్, ఇతర ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే క్యాంపుల్లో 77 మంది స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారు. వీరితో పాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు 68 మంది కూడా వైద్య సేవలు అందిస్తారు.

క్యాంపుల్లో వైద్య సేవల కోసం..

వైద్య శిబిరాల్లో ఆరోగ్యశ్రీ నుంచి 40 మంది, వైద్య విధాన పరిషత్ నుంచి 37 మంది స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారు. ఆర్థోపెడిక్ -23, గైనకాలజిస్టులు (స్త్రీల వైద్యులు) -15, జనరల్ మెడిసిన్ -5, జనరల్ సర్జన్స్ -12, ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) -4, డెర్మటాలజిస్టులు (చర్మం) -4, పిల్లల వైద్యులు -4, మానసిక వైద్యులు -3, మత్తు వైద్యులు -2, కంటి వైద్యులు -1, ల్యాబ్ వైద్యులు -3, మైక్రో బయాలజి -1 ఉంటారు. వీరు కాక నోడల్ ఆఫీసర్ -1, తహసీల్దార్లు 20, ఎంపీడీవోలు 20, పీహెచ్‌సీ వైద్యులు 68, ఏఎన్‌ఎంలు 250, ఎంఎల్‌పీహెచ్‌లు 250 ఉంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 30వ తేదీ నుంచి నవంబర్ 13 వరకు వైద్య శిబిరాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ముందుగా నిర్వహించిన సర్వేలో ఆరోగ్య సమస్యలకు వైద్య క్యాంపుల్లో స్పెషలిస్టు వైద్య సేవలు అందిస్తారు. ప్రతి వైద్య శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టులు అందుబాటులో ఉంటారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తాం. శనివారం నిర్వహించే వైద్య శిబిరాలకు అన్నీ సిద్ధం చేశాం. ఈ క్యాంపులను నోడల్ అధికారి, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేస్తారు.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

వైద్య శిబిరాల వివరాలు..

మండలం	గ్రామం	క్యాంపు నిర్వహించే ప్రదేశం
ఆచంట	ఆచంట-1	శ్రీరామేశ్వరస్వామి సత్రం
ఆకివీడు	చినకాపవరం	గ్రామ సచివాలయం
అత్తిలి	అత్తిలి-3	సచివాలయం
భీమవరం	తాడేరు	సచివాలయం
యలమంచిలి	కొంతేరు	జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్
గణపవరం	గణపవరం-2	సచివాలయం
ఇరగవరం	కాకిలేరు	సచివాలయం
కాళ్ల	కాళ్ల-1	సచివాలయం
మొగల్తూరు	రామన్నపాలెం-1	పాఠశాల
నర్సాపురం	చిట్టవరం	సచివాలయం
పాలకోడేరు	గొరగనమూడి	విలేజ్ క్లినిక్
పాలకొల్లు	ఆగర్రు	సచివాలయం
పెంటపాడు	దర్శిపురం	విలేజ్‌క్లినిక్
పెనుగొండ	ఇల్లపర్రు	సచివాలయం
పెనుమంట్ర	నెగ్గిపూడి	ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద
పోడూరు	పోడూరు-2	విలేజ్ క్లినిక్
తాడేపల్లిగూడెం	ఆరుగొలను	సచివాలయం
తణుకు	దువ్వ-1	సచివాలయం
ఉండి	చిలుకూరు	విలేజ్ క్లినిక్
వీరవాసరం	ఉత్తరపాలెం	సచివాలయం
పట్టణాల్లో..		
ఆకివీడు	మాదివాడ	అర్బన్ పీహెచ్‌సీ క్యాబిన్ రోడ్డు
భీమవరం	యామిజాలవారి వీధి	పీఎస్‌ఎం గరల్స్ హైస్కూల్
నర్సాపురం	ఎన్‌టీఆర్ కాలనీ	అర్బన్ పీహెచ్‌సీ
పాలకొల్లు	బంగారువారి చెరువు గట్టు	డాక్టర్ డీఎన్ఆర్ కళాశాల
తాడేపల్లిగూడెం	వాకర్స్ కాలనీ-3	వైఎస్సార్ అర్బన్ క్లినిక్
తణుకు	ఎన్‌జీవో కాలనీ	మహిళ డిగ్రీ కళాశాల

యువతి ఆత్మహత్య కేసులో వ్యక్తి అరెస్టు

సాక్షి, భీమవరం: పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న మందలంక మెర్సీ కేసులో నిందితుడు దాడి కిషోర్‌ను అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ జి.శ్రీనివాస్ శుక్రవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన మందలంక విజయకుమార్ కుమార్తె మెర్సీ పట్టణంలోని ఒక హోటల్లో పనిచేస్తోంది. అదే హోటల్లో పనిచేస్తున్న కాకినాడ జిల్లా కోటనందురు మండలం బొద్దలంక గ్రామానికి చెందిన కిషోర్ మధ్య కొంతకాలం ప్రేమ వ్యవహారం నడిచింది. తనను వివాహం చేసుకోవాలని మెర్సీ నిలదీయగా, కిషోర్ నిరాకరించాడు. దీంతో ఈనెల 24న మెర్సీ యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి నాన్నమ్మ మందలంక సౌధామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు కిషోర్‌ను శుక్రవారం హోటల్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ శ్రీనివాస్ చెప్పారు.

చవితి పందిరిలో అగ్నిప్రమాదం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామంలో వినాయక చవితి పందిరిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో వరసిద్ధి వినాయక 22వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేసిన చలువ పందిరి నుంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో ఈ ప్రమాదం సంభవించినట్లు చెబుతున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు మంటలను అదుపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

వేధింపులపై కేసు నమోదు

ముసునూరు: వేధింపులకు గురిచేస్తున్న భర్త, బంధువుల నుంచి రక్షణ కల్పించాలని ఓ వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు శుక్రవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చింతలవల్లికి చెందిన యలమర్తి స్వామిదాసు కుమార్తె కమలను మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా నిడదవోలు మండలం బ్రాహ్మణగూడెంకు చెందిన దూలపల్లి మునీంద్ర పరిచయం చేసుకున్నాడు. బంధువులతో కలసి కమల ఇంటికి వచ్చి మోసపు మాటలతో పెళ్లి సంబంధం కుదుర్చుకున్నారు. 2021 ఆగస్టు 13న వీరి వివాహం జరిగింది. తొలి రోజునుంచే ఆమెను అనుమానపు మాటలతో భర్త వేధింపులు గురిచేయడం ప్రారంభించాడు. గర్భం కోల్పోయేలా కూడా తీవ్రంగా హింసించాడు. కొంత కాలం నుంచి అదనపు కట్నం కావాలని వేధిస్తూ చంపాలని ప్రయత్నిస్తున్నాడు. బంధువులతో కలసి శారీరక, మానసిక వేధింపులు ఎక్కువవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాలిక హత్య కేసులో బాబాయ్ అరెస్టు

సాక్షి, భీమవరం: భీమవరం లెప్రసీ కాలనీలో ములుకు రత్నకుమారి (12) హత్య కేసులో నిందితుడు వరుసకు బాబాయ్ అయిన ములుకు శివ (మావుళ్లు)ను అరెస్టు చేసినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. కేసు వివరాలను వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. లెప్రసీ కాలనీలో నివాసముంటున్న ములుకు అంజి, దుర్గ దంపతుల కుమార్తె రత్నకుమారి ఈనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని ఈ నెల 27న వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో దుర్గ ఫిర్యాదు చేసిందన్నారు. బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, 28న బాలిక మృతదేహం వారి ఇంటి వెనుక గల జమ్ముగడ్డి తోటలో కనిపించడంతో అదృశ్యం కేసును హత్య కేసుగా మార్పు చేసి దిశ డీఎస్పీ ఎన్.మురళీకృష్ణ దర్యాప్తు చేపట్టారని ఎస్పీ వివరించారు. అయితే బాలికను హత్య చేసిన మృతురాలికి వరుసకు చిన్నాన్న అయిన మావుళ్లు తనపై బాలిక బంధువులు దాడి చేస్తారనే భయంతో శుక్రవారం సాయంత్రం డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ వద్ద లొంగిపోయి బాలిక మరణానికి తానే కారణమని ఒప్పుకున్నట్లు ఎస్పీ వివరించారు. దీంతో మావుళ్లను అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే బాలిక ఎలా మృతి చెందిదనే విషయం పోస్టుమార్టం రిపోర్టులో తెలియాల్సి ఉందన్నారు. దిశ డీఎస్పీ మురళీకృష్ణ, భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, సీఐ అడబాల శ్రీను, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



బాలిక హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

రౌడీ షీటర్ హత్య కేసులో నలుగురి అరెస్టు

సాక్షి, భీమవరం: భీమవరంలో రౌడీషీటర్ బెరవ విజయ్‌బాబు హత్యకేసులో ప్రధాన నిందితుడు రౌతుల రఘుబాబుతోపాటు మరొక ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు డీఎస్పీ బండారు శ్రీనాథ్ చెప్పారు. శుక్రవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో టుటౌన్ సీఐ జి.శ్రీనివాస్‌తో కలసి వివరాలను వెల్లడించారు. రఘుబాబుతోపాటు విస్సాకోడేరుకు చెందిన కాకర్ల అనిల్, నల్లి రాజేష్, నరసాపురానికి చెందిన గన్నవరపు రాజును భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన రౌతుల ఏసు హత్య కేసులో నిందితులుగా ఉన్న బెరవ విజయ్‌బాబు, అతని సోదరుడు గోవిందరావు ఈనెల 17న టుటౌన్ పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్స్ కౌన్సెలింగ్‌కు హాజరై మోటారుసైకిల్‌పై తిరిగి వెళుతుండగా వీరిని హత్యచేసేందుకు పథకం ప్రకారం గొల్లవానితిప్ప రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద కారుతో ఢీకొట్టారు. కింద పడిపోయిన విజయ్‌బాబును కత్తులతో నరికి హత్య చేశారు. గోవిందరావు తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టుటౌన్ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి ఈనెల 22న నిందితులను అరెస్టు చేశామని, మిగిలిన నలుగురు నిందితులను టౌన్‌రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుల అరెస్టులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ఫణిమోహన్, ఏఎస్సై పి.సూర్యనారాయణ, కానిస్టేబుళ్లు ముత్యాలరావు, శంకర్‌లను ఎస్పీ యు రవిప్రకాష్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనాథ్, సీఐ శ్రీనివాస్

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళ సమస్యను వింటున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



నరసాపురం: నరసాపురం 3వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

మార్టేరులో బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



మార్టేరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: బాస్కెట్‌బాల్ క్రీడలలో రాష్ట్రానికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయాలని ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మార్టేరులో నాలుగు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి 9వ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో అందరూ విజేతలు కాలేరని, ఓటమి స్ఫూర్తితోనే విజయానికి మరో ముందడుగు వేయాలన్నారు. మార్టేరులో స్పోర్ట్స్ హాస్టల్ నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని, జాతీయ స్థాయిలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల శిక్షణ కార్యక్రమాన్ని కూడా మార్టేరులోనే ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. మార్టేరు సర్పంచ్ మట్టాకుమారి అధ్యక్షత వహించగా ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.చక్రవర్తి, జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, సత్తివెంకటరెడ్డి, మేడపాటి చిరంజీవిరెడ్డి, యూత్ బాస్కెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధ జోగిరెడ్డి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు అండగా వైఎస్సార్ బీమా

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- మృతుడి కుటుంబానికి బీమా మంజూరు పత్రాల అందజేత

తణుకు అర్బన్: ప్రమాదాల్లో మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆర్థికంగా అండగా నిలబడుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ బీమా మంజూరు పత్రాలను మంత్రి కారుమూరి మృతుడి భార్య, పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి ముఖ్యమంత్రి పెద్ద మనస్సుతో సత్వరమే ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఈనెల 11వ తేదీన తణుకులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొబ్బరితీత కార్మికుడు కొలుసు రాము మృతి చెందగా, అదే రోజు మట్టి ఖర్చులకు రూ.10 వేలు ప్రభుత్వం తరపున అందజేశారని, ఇప్పుడు మిగిలిన రూ.4,90,000 నేరుగా మృతుడి భార్య సత్యవతి బ్యాంకు అకౌంట్‌కు జమ చేసినట్లు చెప్పారు. మానవతా దృక్పథంతో వైఎస్సార్ బీమా ద్వారా ఆ కుటుంబానికి జగనన్న అండగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, వారు తినగా మిగిలిన సొమ్ము బాధితులకు అందజేసే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. మృతుడి కుమారులిద్దరికీ అవసరమైన సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, జల్లూరి జగదీష్ పాల్గొన్నారు.



తణుకులో బాధిత కుటుంబానికి బీమా పత్రాలు అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

మొగల్లులో పట్టపగలే చైన్ స్నాచింగ్

పాలకోడేరు: మొగల్లులో పట్టపగలు చైన్‌స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. బస్సు కోసం నిరీక్షిస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు తాడును గుర్తు తెలియని ఆగంతకుడు తెంపుకుని అప్పటికే సిద్ధంగా స్కూటీపై పరారయ్యాడు. మొగల్లుకు చెందిన కూసంపూడి రామసీత తణుకు వెళ్లేందుకు గ్రామంలోని గంగానమ్మ గుడి వద్ద బస్సు కోసం నిరీక్షిస్తోంది. ఆ సమయంలో ఇద్దరు యువకులు స్కూటీపై వచ్చి ఆమె వద్ద ఆపారు. బండి నడుపుతున్న వ్యక్తి గొల్లలకోడేరుకు ఎటు వెళ్లాలంటూ రామసీతను అడిగాడు. అంతలోనే స్కూటీపై వెనుక కూర్చున్న యువకుడు రామసీత మెడలోని సూత్రాల తాడును తెంపుకుని వచ్చిన దారినే పరారయ్యారు. బాధితురాలు రామసీత వెంటనే తేరుకుని లబోదిబోమంటూ పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు యువకులకు 25 ఏళ్ల వయసు ఉండవచ్చని, నంబర్ ప్లేట్ లేని తెలుపు రంగు స్కూటీపై వచ్చారని, ఇద్దరూ నలుపు రంగు మాస్క్ ధరించారని, వెనుక కూర్చున్న యువకుడు నలుపు రంగు షర్ట్ వేసుకున్నాడని, ముందు కూర్చున్న యువకుడికి జుట్టు ఎక్కువగా ఉందని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.





PLOT FOR SALE


■ 22 సెంట్లు 5లక్షలకే (దసరా ఆఫర్) కస్టమర్స్‌కు మాత్రమే. ప్రకాశంజిల్లా, ముండ్లమూరు దగ్గరలో 4 సం. ఎర్రచందనం మొక్కలతో పూర్తి డెవలప్‌మెంట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 95234 56789. [B-1206657]

BULDING FOR SALE

■ ఏలూరు విద్యానగర్ సాయిబాబా గుడి దగ్గర వెస్ట్ ఫే॥ 536 చ॥గ॥ అపార్ట్‌మెంట్‌కు అనుకూలమైన స్థలం 3000 SFT 4 BHK బిల్డింగ్ అమ్మకము. సంప్ర: 9912811666, 9849007617 [P-772909]

COMMERCIAL SALE

■ Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]



BUSINESS OFFER

■ మీకు తెలిసిన వంట నైపుణ్యంతో మీ ఇంట్లోనే షీరో హోమ్ ఫుడ్ కిచెన్ ని ప్రారంభించి ప్రతినెలా స్థిరమైన ఆదాయాన్ని పొందండి ఉచిత సెమినార్ లో పాల్గొనేందుకై ఫోన్ : 6309527444 [HA-193252]



■ శ్రీసిటి తడ (A.P) లో డైకిన్ A/C తయారీ కంపెనీ నందు పనిచేయుటకు డిప్లొమా (MECH, EEE, ECE, CIVIL) B.Tech, డిగ్రీ అభ్యర్థులు కావలెను. సంప్ర: 9177311150 [P-772911]

■ భీమవరంలో జిరాక్స్ షాపులో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ కలవారు కావలెను. జీతం : 5 వేలు. టైమ్ 8 A.M. to 8 P.M. పరిసర ప్రాంతాల వార్కి ప్రాధాన్యత. ✆ : 90000 72612 [R-1171213]

■ పనిమనిషి (మగ) కావలెను: హైదరాబాద్‌లో ఇంటిలో పనిచేయుటకు మగ పనిమనిషి కావలెను. ఉచితంగా వసతి కల్పించబడును. ఆకర్షణీయమైన జీతం. సెల్: 94400 35395 [B-1193591]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801116]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9160900024 [HA-657]

■ హైదరాబాద్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ J.Groupలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ మరియు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం: 15000 to 25000 (కమీషన్+టీఏ+ఇన్సెంటివ్స్) Qul: 10th to Any Degree. ✆ 73961 85576, 80081 97227 [B-1193167]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి


పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధి తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాల్లోని రైతులు ఈ నెల 30వ తేదిలోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.డివిజన్‌లో ఇప్పటికే 95 శాతం ఈ-క్రాప్ నమోదైందన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ-పంట, ఈ-కేవైసీ పూర్తయిన వారి నుంచే ధాన్యం కొనుగోలు చేయబడునని, పంట నష్టపరిహారం, పంటల బీమా వర్తిస్తుందన్నారు. కౌలు రైతులకు, రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ పంట వడ్డీ రాయితీలు వర్తిస్తాయన్నారు. రైతులు ఈ విషయాలను గుర్తించి, ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు పూర్తి చేసుకోవాలన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీహోమం


ముత్యాలంబపురం ముత్యాలమ్మ ఆలయంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలమ్మ దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమం, లలిత సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాకా బాలాజీ మాట్లాడుతూ అక్టోబరు 15 నుంచి 25వ తేది వరకు ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అక్టోబరు 1వ తేదిన ఉదయం 9 గంటలకు మట్టితో అమ్మవారి ప్రతిమను తయారు చేయడానికి, 9.45 గంటలకు ఉత్సవాలకు శ్రీకారం చుట్టేందుకు పందిరి రాట ముహూర్తం నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


చిన్నారులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో క్లబ్ జిల్లా కోఆర్డినేటర్, దాత వెశ్యంకి సత్య స్వరూప్ సహకారంతో కడకట్లలోని ప్రాథమిక పాఠశాల చిన్నారులకు భోజనం ప్లేట్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. మరో దాత పూతినీడి శివరామకృష్ణ సౌజన్యంతో పడాల జీవన వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, కోటి విజయ్ కిషోర్, యడ్లపల్లి తిలక్, కుందుం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'గూడెం'లో 13.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడచిన 24 గంటల్లో 13.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ శుక్రవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 17.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

నేడు విప్పర్రులో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: మండలం విప్పర్రు గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అధికారులు, పార్టీ నాయకులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధులపై ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు కడకట్ల, వీకర్స్ కాలనీ, ఎన్‌టీఆర్ జంక్షన్ పరిధిలో 7, 8, 11, 29 వార్డులలో శుక్రవారం ఆరోగ్య సురక్ష సర్వేలు జరిగాయి. ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు చేశారు. ఆరోగ్య సురక్ష కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

భళా.. చిత్రకళ..

- చిత్రకళలో తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థుల హవా
- బంగారు పతకాలు సాధిస్తున్న వైనం
- పోటీకెళ్తే పతకాల పంటే

తణుకు అర్బన్: చిత్రకళలో తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు సత్తా చాటుతున్నారు. పాఠశాలలో చిత్రకళా ఉపాధ్యాయులు ఇచ్చిన తర్ఫీదుతో ఎటువంటి కళాఖండాన్నైనా సునాయాసంగా తీర్చిదిద్దుతున్నారు. వారి నైపుణ్యానికి గుర్తించిన పలు సంస్థలు, ఫౌండేషన్‌లు పాఠశాల విద్యార్థులకు బంగారు పతకాలు అందచేస్తున్నారు. పోటీ ఎక్కడైనా, ఎప్పుడైనా తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు వస్తున్నారంటే పతకాలు పట్టుకుపోతారనే నానుడి కూడా ఈ పాఠశాల విద్యార్థులకు దక్కింది.

అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో

ఇటీవల హైదరాబాద్ యంగ్ ఇన్వాయిస్ ఇంటర్నేషనల్ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 30 మంది విద్యార్థులు జ్యూరీ హానర్ బహుమతులు అందుకున్నారు. అంతకుముందు విజయవాడలో డ్రీమ్ యూత్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో 15 మంది బంగారు పతకాలు, 10 మంది సిల్వర్ మెడల్స్ సాధించారు. దీంతో చిత్రకళా పోటీల్లో తణుకు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వస్తున్నారంటే మిగిలిన పాఠశాలల విద్యార్థులు హడలెత్తిపోతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాలలో ప్రస్తుతం ఇద్దరు చిత్రకళా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.


తణుకులో చిత్రకళలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు (ఫైల్)

చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం



తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో 6వ తరగతి నుంచి చిత్రలేఖనంలో మా ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణతో ఎన్నో చిత్రాలు వేశాను. చాలా సందర్భాల్లో బంగారు పతకాలు అందుకున్నాను. నాకు చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టపడుతున్నాను.

– బి. నందిని, తణుకు జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని

మంచి మెలకువలు నేర్పిస్తున్నారు



పాఠశాలలో నాకు మా చిత్ర కళా ఉపాధ్యాయులు నేర్పిస్తున్న చిత్రలేఖనం తరగతి అంటే నాకు చాలా ఇష్టం. 8వ తరగతి నుంచి నేను చిత్రలేఖనంలో పట్టు సాధించాను. మా ఉపాధ్యాయులు చిత్ర కళలో ఎన్నో మెలకువలు నేర్పిస్తున్నారు.

– ఓ. కనకమహాలక్ష్మి, తణుకు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని

మంచి చిత్రాలు గీస్తున్నాను



నాకు చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. ఈ పాఠశాలలో చేరిన తరువాత మా చిత్రకళా ఉపాధ్యాయులు నాపై ప్రత్యేక శ్రద్ధ చూపించి చిత్రకళలో ఉన్న నాణ్యతను, మెళకువలను చెప్పారు. వారి కృషి ఫలితంగా మంచి చిత్రాలను నేను రూపొందించగలుగుతున్నాను.

–ఎస్.ఖ్యాతిక, తణుకు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని

చిత్రకళకు అధిక ప్రాధాన్యత



చిత్ర కళకు మా పాఠశాల పెట్టింది పేరుగా ఉంటుంది. 6వ తరగతి సమయంలో నాలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించిన మా చిత్రకళా ఉపాధ్యాయులు నన్ను ఎంతగానో ప్రోత్సహించి పలు పోటీల్లో బంగారు పతకాలు సాధించేలా తీర్చిదిద్దారు.

– సీహెచ్ చరణ్, తణుకు జెడ్పీ హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి

సాంకేతిక పద్ధతులపై అవగాహన అవసరం


రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: నూతన సాంకేతిక పద్ధతులపై రైతులకు ఆకళింపు కలిగిస్తే సత్ఫలితాలు వస్తాయని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవిశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ కోరారు. వర్సిటీ ఆధ్వర్యంలో నల్లజర్ల మండలం తెలికిచర్ల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాంకేతిక పద్ధతులను సరైన విధానంలో రైతులకు వివరిస్తే, పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు గ్రామంలో ఆదర్శ రైతులను ఎంచుకొని గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శాస్త్రవేత్తలను పిలిచి రైతులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ,, అసోసియేట్ డీన్ యమ్.మాధవి, కెవికె శాస్త్రవేత్తలు ఏ.దేవీవరప్రసాదరెడ్డి, యం,రాఘవేంద్రరెడ్డి, కె.వెంకటసతీష్, లక్ష్మీప్రసన్న, భవిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కృష్ణాయపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆలోచనా విధానంలో ఎంతో మార్పు వచ్చిందని, సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి కోరుకుంటున్నారని, ఇది ఆరోగ్యకరమైన మార్పు అని ఆయన పేర్కొన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. దీంతో తమ బిడ్డ ఇంజనీరింగ్, బీటెక్ చదువుతున్నారని తల్లిదండ్రులు గర్వంగా చెప్పుకునే పరిస్థితి వచ్చిందన్నారు. తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. అయితే, పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చి మూడు నెలలు తిరగకుండానే అనేక స్కామ్‌లకు పాల్పడ్డారన్నారు. దీనిలో స్కిల్ డవలప్‌మెంట్ ఒకటని పేర్కొన్నారు. దాదాపు రూ.371 కోట్లు కాజేశాడన్నారు. నాడు అధికారులు అభ్యంతరం చెప్పినా సీఎం హోదాలో చంద్రబాబు ఆదేశాల మేరకు నాడు డొల్ల కంపెనీకి నిధులు విడుదల చేశారన్నారు. అప్పట్లో అసలు ఫైల్స్ తగలబెట్టించారన్నారు. వాటికి షాడో ఫైల్స్ ఉంటాయనే విషయం చంద్రబాబుకు తెలియదన్నారు. దీంతో చంద్రబాబు బండారం బయటపడిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 20 ఏళ్లు పైబడి ఉన్న ప్రతీ ఒక్కరికీ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అసలు భూమి గల రైతులకు న్యాయం జరిగిందన్నారు. అన్యాయంగా జగన్‌ను 16 నెలల పాటు జైలులో పెట్టించారన్నారు. ఆ కేసులు రుజువు కాకపోవడంతో కొట్టేశారన్నారు. చంద్రబాబు స్కామ్‌లపై సీఎం జగన్ పారదర్శకంగా దర్యాప్తు సంస్థకు బాధ్యతలు అప్పగించారన్నారు. ఏపీ ఫైబర్ నెట్, ఇన్నర్‌రింగ్ రోడ్డులో వేల కోట్లు దోచేశారని, పక్కా ఆధారాలతో దొరికిపోవడంతో చంద్రబాబును సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపించారన్నారు. చంద్రబాబు కేసు వాదించేందుకు ఢిల్లీ నుంచి లాయర్‌ను రప్పించి దాదాపు రూ.15 కోట్లు చెల్లించారన్నారు. ఆధారాలు దొరికిన తర్వాత చట్టం దృష్టిలో అందరూ సమానులేనని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా చేస్తున్న దీక్షలకు పట్టుమని పది మంది రాని పరిస్థితి ఉందన్నారు.

1.60 కోట్లు కుటుంబాల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని డిప్యూటీ సీఎం కొట్టు పత్యనారాయణ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా ప్రతీ ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది వచ్చి బీపీ, సుగర్ పరీక్షలు వంటి అనేక పరీక్షలు చేస్తారన్నారు. ఆ తదుపరి 15వ రోజును నిర్వహించే క్యాంపుల్లో నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ఉన్నత వైద్యంతో పాటు ప్రతీ నెలా వారికి మందులు అందించనున్నట్టు తెలిపారు. ఇటువంటి మంచి పాలన అందిస్తున్న జగన్ ఎక్కడ...? దుర్మార్గుడైన చంద్రబాబు ఎక్కడ...? అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, షేక్ బాషా, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, చిక్కాల సత్యనారాయణ, జద్దు హరిబాబు, డైరెక్టర్ మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీ ఎం.లక్ష్మి, పీఆర్ డీఈ వీఎన్.వేణుగోపాల్, హౌసింగ్ ఏఈ వైవీ.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అప్పారావు, పంచాయతీ ఈవో ఆర్‌వీ.బ్రహ్మం, సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు కొట్టు విశాల్, బొద్దాని శ్రీనివాస్, కంఠమని సత్యనారాయణ, గజ్జరపు రామకృష్ణ, పుట్టా ఉమామహేశ్వరరావు, నక్కా గంగాధర్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి సు'రక్ష'

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్


తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ చెప్పారు. శుక్రవారం తణుకు సజ్జాపురంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే చేయడం దేశంలోనే ఇదే మొదటిసారని, సర్వే అనంతరం సచివాలయ స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించి సర్వేలో గుర్తించి వారికి వైద్య పరీక్షలు, అవసరమైన శస్త్ర చికిత్సలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న సిబ్బందిని వివిధ అంశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి నిర్వహిస్తున్న బీపీ, సుగర్, కంటి పరీక్షలకు సంబందించిన వివరాలను సిబ్బంది ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి సునీత, ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. మండలంలోని గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు చేపట్టిన జగనన్న ఆరోగ్య సర్వేలో భాగంగా శుక్రవారం మొత్తం 3442 మంది పరీక్షలు నిర్వహించారు.వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి బీపీ, సుగర్, కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో కే కిరణ్‌కుమార్ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తాడేపల్లిగూడెం మండలం ఇటుకులగుంట గ్రామంలో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: భీమవరంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. శుక్రవారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలు పాలుపూరి సత్యవతి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పాలుపూరి వెంకాయమ్మ, మల్లిపూడి సీతామహాలక్ష్మి, పి.ధనలక్ష్మి, మాగంటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 14 సంవత్సరాల బాలిక పై అత్యాచారం జరిపి హత్యచేసిన నిందితులను వెంటనే అరెస్టే చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలో పోలీస్ ఐలాండ్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

స్వామినాథన్ మృతి తీరనిలోటు


నివాళులర్పిస్తున్న ఉద్యానవర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరనిలోటని ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. వర్సిటీలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్వామినాథన్ ఘనత గురించి వివరించారు. స్వామినాథన్ శాస్త్రవేత్తలకు స్ఫూర్తి అన్నారు. తన పరిశోధనా పుస్తకం టఫ్ గ్రాస్పెస్ కి డాక్టర్ స్వామినాథన్ ముందుమాట రాశారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, పరిశోధనాసంచాలకులు నారం నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ.స్వామి, డీన్ సలోమిను నీత, ఎస్.సూర్యకుమారి, ఎం.మాధవి , ఇమ్మానియేల్, రమాదేవి, ఉమా కృష్ణ, దివ్య తదితరులు నివాళులర్పించారు.

'భవన్స్'లో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు


పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌లో జిల్లా స్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌లో శుక్రవారం జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 1200 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు పీఎస్ఎన్.మల్లేశ్వరరావు, డీబీ.రాజేంద్ర,ప్రసాద్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శిఎండి.ఖుదుషా, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ, కార్యదర్శిసత్యనారాయణ, భాస్కర్‌లు పర్యవేక్షించారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, గుండు విసరడం తదితర పోటీలు నిర్వహించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పోషణ అవసరం


తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సంపూర్ణ ఆరోగ్యానికి పోషణ అవసరమని అంగన్‌వాడీ టీచర్ జి.దీన స్వరూపారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నెం.80లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపారాణి మాట్లాడుతూ చిరు ధాన్యాలు, ఆకు కూరల్లో పోషకాలు మెండుగా ఉన్నాయని, వాటిని ఆహారంతో విధిగా తీసుకోవాలన్నారు. తద్వారా గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం దుర్గాభవాని అనే మహిళకు సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది టి.లక్ష్మి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆకుతీగపాడులో పౌరహక్కుల దినోత్సవం

పెంటపాడు: పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రతి వ్యక్తి తప్పక పాటించాలని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. ఆకుతీగపాడు ఎస్సీ కమ్యూనిటీ హాలు వద్ద శుక్రవారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యులు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ సమస్యలను పట్టించుకోలేదన్నారు. అప్పట్లో పౌర హక్కుల దినోత్సవాలు సరిగా నిర్వహించలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, పెంటపాడు ఎంపీడీవో బాలాజీ, ఎస్సీ బాలురవసతిగృహ వెల్ఫేర్ అధికారి రామలింగం, గ్రామ వీఆర్వో రామకృష్ణ, కార్యదర్శి నాగదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బీసీ హాస్టల్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14, 17 విభాగాలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబర్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆర్.ధర్మ హర్ష, ఎ.హర్ష, జె.ధనసతీష్, ఏలియ రాజులు ఎంపికైన వారిలో ఉన్నారని ప్రిన్సిపల్ జి.సూర్యకుమారి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ సూర్యకుమారి, పీఈటీ వి.నాగేంద్ర అభినందనలు తెలిపారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధుల విడుదలపై హర్షం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరులోని బీసీ కులాల వారికి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు విడుదలైనట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేల్పూరులోని శెట్టిబలిజ, అగ్నికుల క్షత్రియ, నాయీ బ్రాహ్మణ, రజక కులాల వారికి, తాపీ మేస్త్రులకు, టైలర్స్ కమ్యూనిటీ హాలు, రాజు పట్టి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు గతంలో శంకుస్థాపన చేశారు. ఆయా కుల సంఘాల నాయకులు, పెద్దల ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టి భవనాలను శ్లాబ్ స్థాయి వరకూ నిర్మించారు. దీనిపై కోర్టులో కేసులు వేయడంపై బీసీ కులాల వారు రిలే నిరాహార దీక్షలు చేశారు. ప్రజా ఒత్తిడికి తలొగ్గిన టీడీపీ నాయకులు కోర్టులో కేసులు ఉప సంహరించుకున్నారు. ఇటీవల వేల్పూరులోని బీసీ కులాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సంబంధించి రూ.43.34 లక్షల నిధులు విడుదలయ్యాయి. వేల్పూరులోని బీసీ కులాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయడంపై గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ శేషుకుమారి, ఎంపీటీసీ చుండ్రు శ్యామల, శెట్టి బలిజ సంఘం నాయకుడు గుత్తుల సత్యనారాయణ, అగ్నికుల క్షత్రియ సంఘం మల్లాడి మాధవ కృష్ణ, రజక సంఘం నాయకుడు అవిడి శ్రీనివాసు, టైలర్స్ యూనియన్ నాయకుడు పగడాల ధర్మరాజు, భద్రం, రాజులపట్టి కాలనీ నాయకులు పారిచర్ల శ్రీనివాసు, చుండ్రు బులివీరయ్య, తాపీ మేస్త్రీ సంఘం మార్ని మల్లేశ్వరరావు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఏపీఎస్ఆర్టీసీ డిపో పరిధిలో సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించడానికి ఈ నెల 30వ తేదీ శనివారం 12 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. పుణ్యక్షేత్రాలకు నడిపే ప్రత్యేక బస్సులు, కార్గో సేవలు, తదితర విషయాలపై ఫోన్ నెంబర్ 99592 25488కు ఫోన్ చేయాలని కోరారు.

శ్రీ జనార్ధన స్వామి వారి దేవస్థానము
పడమర విప్పర్రు (గ్రా). పెంటపాడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా
e-Procurement Tender
NIT No. P1/COE/523/2023-38 Date: 29.09.2023
అర్చక క్వార్టర్స్ నిర్మాణము కొరకు e-procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender. apeprocurement.gov.in వెబ్ సైట్‌ను చూడగలరు.
తేది: 29.09.2023 పడమర విప్పర్రు
కె.సాంబశివరావు
సెల్: 9866937145

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com